క్లుప్తంగా

మహిళా పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఫిరంగిపురం: మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ షేక్‌ షహేలానర్గీస్‌ అన్నారు. మండల పరిషత్‌ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ కల్పించడంపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్‌ కల్పించారని చెప్పారు. దీనిపై కేంద్రానికి విజ్ఞప్తి చేశారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లేందుకు ఈ బిల్లు ఎంతగానో దోహదపడుతుందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌, పీఎం నరేంద్ర మోడీ చేస్తున్న కృషి ఎనలేనిదని దీనిపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

24న ఇప్పటంలో మెగా వైద్యశిబిరం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో ఈనెల 24వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్‌ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెగా వైద్యశిబిరాన్ని ఇప్పటంలోని డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నామని, బీపీ, ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా అందజేస్తామని, ఇప్పటం పరిసర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెగా వైద్య శిబిరంలో 286 మందికి పరీక్షలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్‌ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్‌ విశ్వవిద్యాలయంలో ఎంజె నాయుడు హాస్పిటల్‌ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కేఎల్‌ యూనివర్సిటీ డీన్‌ డాక్టర్‌ హబీబుల్లా ఖాన్‌ ప్రారంభించారు. ఎంజె నాయుడు హాస్పిటల్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ వావిలాల రజనీకాంతశర్మ మాట్లాడుతూ ఎంజె నాయుడు హాస్పిటల్‌ వైద్యుల ఆధ్వర్యంలో కేఎల్‌యూలో పనిచేస్తున్న వారికి ఎముకలు, కీళ్ల సమస్యలు, బీపీ, షుగర్‌, ఎముకల అరుగుదల పరీక్షలను నిర్వహించి, సందేహాలు నివృత్తి చేశామని తెలిపారు. సుమారు 286 మందికి ఎంజె నాయుడు హాస్పిటల్‌ వైద్యులు డాక్టర్‌ రవి, డాక్టర్‌ తేజ, డాక్టర్‌ వంశీకృష్ణ, డాక్టర్‌ నాగేశ్వరరావు, డాక్టర్‌ జ్యోతి తదితరులు వైద్య సేవలను అందించారని అన్నారు. శిబిరంలో యూనివర్సిటీ ప్రొ వీసీ ఏవీఎస్‌ ప్రసాద్‌, డీన్‌ హనుమంతరావు, అసోసియేట్‌ డీన్‌ రూతు రమ్య, ప్రొఫెసర్‌ ఆర్‌.సుభాకరరాజు, జి.చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

రుణాలు ఇవ్వాలని కోరుతూ కౌలు రైతుల ధర్నా

తాడేపల్లిరూరల్: కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలోని యూనియన్‌ బ్యాంక్‌ వద్ద ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కౌలు రైతు సంఘం ప్రధానకార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డు పొందిన ప్రతి కౌలు రైతుకు స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌ ప్రకారం రుణాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సంఘం మండల కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 27న జిల్లా లీడ్‌ బ్యాంక్‌ వద్ద ధర్నా నిర్వహించనున్నామని, కౌలు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం యూనియన్‌ బ్యాంక్‌ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు భీమవరపు అమ్మిరెడ్డి, చిలువూరు గ్రామ అధ్యక్ష కార్యదర్శులు బి. కనకాంబరం, టి.రామారావు, పిల్లి ప్రభాకరరావు, ఎన్‌.శేషకుమార్‌, ఎన్‌.అవినాష్‌, ఎన్‌.గోపాలరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ పరీక్షలపై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం నుదురుపాడు, ఫిరంగిపురం, పలకలూరు సెక్టార్‌ పీహెచ్‌సీల ఏఎన్‌ఎంలకు హిమోగ్లోబిన్‌ మీటర్లు వాడే విధానం గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బిజినెస్‌ డెవలప్‌మెంట్‌ ఇంజినీర్‌ సిద్దార్థ ఉపాధ్యాయ మాట్లాడుతూ ముందుగా హెచ్‌బీ మీటర్‌ కోడ్‌ను సరిచూసుకొని తరువాత పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. పరీక్ష కోసం రక్తనమూన సేకరించే సమయంలో మొదటిసారి వచ్చిన రక్తం చుక్క కాకుండా దానిని దూదితో తుడిచి రెండోసారి వచ్చిన రక్తం చుక్కను మాత్రమే పరీక్ష కోసం వినియోగిస్తే సరైన ఫలితాలు వస్తాయని చెప్పారు. పలు అంశాలపై సూచనలు అందజేసి మిషన్‌ వాడే విధానం వారికి చూపించారు. కార్యక్రమంలో సర్వీస్‌ ఇంజినీర్‌ ఉదయ్‌ కిరణ్‌, వైద్యురాలు ఫరీనాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న టిడ్కో వాసుల కష్టాలు

- తాగునీరు, విద్యుత్‌ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- రూ.1.10 కోట్లతో ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌
- రూ.7.20 కోట్లతో ఇండోర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ నిర్మాణం
- తుది దశకు చేరుకున్న పనులు
- ఎమ్మెల్యే ఆర్కే చొరవ

మంగళగిరి: నగరంలోని ఆటోనగర్‌ వద్ద కల టిడ్కో ఇళ్లల్లోని నిర్వాసితులకు తాగునీరు, విద్యుత్‌ సరఫరాకు కొద్ది రోజులలోనే శ్వాశత పరిష్కారం లభించనుంది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో పనులు శరవేగంగా కొనసాగుతుండగా ఆయన నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సుమారు 2700 కుటుంబాలు నివసిస్తున్నాయి. జిల్లాలోనే అనేక వసతులతో తొలిసారి నిర్వాసితులకు మంగళగిరిలో పంపిణీ చేశారు. అయితే ఇప్పటివరకు ఏపీఐఐసీ నుంచి తాగునీటిని సరఫరా చేస్తుండగా కార్పొరేషన్‌ నుంచి విద్యుత్‌ సరఫరా చేస్తున్నారు. నిర్వాసితులంతా ఇళ్లల్లోకి రావడంతో సాంకేతిక కారణాలతో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన ఎమ్మెల్యే ఆర్కే వెంటనే తాగునీటి ట్యాంకును యుద్ధప్రాతిపాదికన నిర్మించాలని అధికారులకు సూచించడంతో రూ.1.10 కోట్లతో ట్యాంకు, రూ.7.20 కోట్లతో ఇండోర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పనులు చేపట్టగా పనులు తుది దశకు చేరుకున్నాయి. విద్యుత్‌ సరఫరా కోసం ఇండోర్‌ సబ్‌స్టేషన్‌ నిర్మిస్తున్నారు. దీంతో మరికొద్ది రోజుల్లోనే పనులు పూర్తికానుండటంతో టిడ్కో నిర్వాసితులకు తాగునీటి, విద్యుత్‌ సరఫరాకు శాశ్వత పరిష్కారం లభించనుంది. టిడ్కో ఈఈ ప్రసాద్‌ మాట్లాడుతూ తాగునీటి ట్యాంకు పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే పూర్తి చేసి పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. విద్యుత్‌ డీఈఈ అక్కల సత్యనారాయణ మాట్లాడుతూ ఇండోర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పనులు త్వరలోనే పూర్తి చేసి టిడ్కో నివాసాలకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం లేకుండా అందిస్తామన్నారు.



తుది దశకు చేరుకున్న ట్యాంకు, ఇండోర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌

సబ్‌ప్లాన్‌ చట్టాన్ని పునరుద్ధరించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్‌ శివనాగమణి



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్‌ వి.శివనాగమణి

తాడేపల్లిరూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రద్దుచేసిన సబ్‌ప్లాన్‌ చట్టాన్ని పునరుద్ధరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్‌ వి. శివనాగమణి డిమాండ్‌ చేశారు. గురువారం తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్‌, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి శివనాగమణి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుకార్చే 41 సీఆర్‌పీసీ ప్రకారం బెయిల్‌ ఇవ్వటాన్ని వ్యతిరేకించాలని డిమాండ్‌చేశారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌, మానిటరింగ్‌ కమిటీ ఏర్పాటు చేసి సంఘాలకు కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సెప్టెంబర్‌ 29న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న ధర్నాలో దళిత, గిరిజనులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేవీపీఎస్‌ నాయకులు కంపా వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు తుడిమెల వెంకటయ్య, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.చిన్న చెన్నయ్య, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, ఏసిపోగు శాస్త్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నీరుడు దుర్గారావు, కేవీపీఎస్‌ నాయకులు బి.ఏషియా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం గొడవర్రు గ్రామంలో గురువారం రైతులకు వరి పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ డిప్యూటీ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ రామాంజనేయులు విచ్చేశారు. తొలుత గొడవర్రులోని వరి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వరి పంటకు ఆశించే సుడిదోమ, అగ్గితెగులు, పొడ తెగులు నివారణ మార్గాలను వివరించారు. ఎరువుల వాడకం, నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సుడిదోమ ఉధృతి తక్కువగా ఉన్నందున రైతులు ఎటువంటి రసాయన మందులు పిచికారి చేయాల్సిన అవసరం లేదని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రాజవంశీ, దుగ్గిరాల వ్యవసాయ అధికారిణి పి.శిరీష, గ్రామ వ్యవసాయ అధికారి పవన్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయుష్మాన్‌భవ కార్డుల పంపిణీ

మంగళగిరి: నగరంలోని గణపతినగర్‌ వైఎస్సార్‌ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆయుష్మాన్‌ భవ కార్డుల పంపిణీ ప్రారంభం చేయనున్నట్లు వైద్యాధికారిణి అనూష గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎన్‌యూహెచ్‌ఎం స్టేట్‌ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ విజయలక్ష్మి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రులో అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాలు.. నిడమర్రుకు చెందిన రమణయ్య(38) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్థాపానికి చెందిన రమణయ్య గురువారం పక్కనే చెరువు కట్ట వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే కుటుంబసభ్యులు రమణయ్యను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

కోలాహలంగా వినాయకుని గ్రామోత్సవం



నిడమర్రులో కోలాహలంగా సాగుతున్న వినాయకుని గ్రామోత్సవం



టిడ్కో నివాసాల వద్ద వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రులో బుధవారం రాత్రి వినాయకుని గ్రామోత్సవం కోలాహలంగా సాగింది. యువకులు భారీగా పాల్గొని వినూత్న రీతిలో వైఎస్సార్‌ సీపీ రంగులతో కూడిన విద్యుత్‌ కాంతుల గొడుగులతో గ్రామోత్సవం కొనసాగగా భక్తులను ఆకట్టుకుంది. మేళతాళాలు, కనక తప్పెట్లు, బాణాసంచా కాల్పుల నడుమ కొనసాగిన గ్రామోత్సవంలో గణనాథుడిని ఆయా కూడళ్లలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా బాలగణపతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. బీఎస్‌ఆర్‌ ఫ్లవర్‌ స్టార్‌ నిర్వాహకులు రూ.24వేలకు వినాయకుని లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.

టిడ్కో నివాసాల వద్ద ప్రత్యేక పూజలు

నగరంలోని టిడ్కో నివాసాల వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి గురువారం వైఎస్సార్‌ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్‌, పట్టణ జేసీఎస్‌ కన్వీనర్‌ ఎండీ ఫిరోజ్‌, స్థానిక నాయకురాలు గుంటి రాజ్యలక్ష్మి, మల్లవరపు సుధారాణి, సాలి ప్రశాంత్‌, ఎండీ గౌస్‌, కురగంటి రాజేష్‌ పాల్గొన్నారు.

నేడు నిడమర్రులో అన్నదానం

వినాయక ఉత్సవాల సందర్భంగా కార్పొరేషన్‌ పరిధి నిడమర్రులో శుక్రవారం మధ్యాహ్నం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఎదుట అన్నదానం జరుగుతుందని గణేష్‌ ఉత్సవ కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. వినాయకుని గ్రామోత్సవం శనివారం కోలాహలంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.



మేళతాళాలతో గ్రామంలో ఊరేగిస్తున్న గణపతి విగ్రహం

నిమజ్జనానికి తరలిన గణనాథులు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు గురువారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు పూజించిన వినాయకుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి మేళతాళాలతో అమరావతిలోని కృష్ణానదిలో నిమజ్జనానికి తరలిస్తున్నారు. మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ రోడ్డులో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం, వేమవరంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలను విశేషపూజలు చేసి నిమజ్జనానికి వాహనాల్లో తరలించారు.

బాలయ్య తీరు ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు

వైఎస్సార్‌ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌



తాడికొండ: శాసనసభలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థలో సిగ్గుచేటని వైఎస్సార్‌ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌ అన్నారు. గురువారం అసెంబ్లీలో టీడీపీ నాయకులు చేసిన అప్రజాస్వామిక విధానంపై స్పందించిన ఆయన మాట్లాడుతూ బావ కళ్లలో ఆనందం చూసేందుకే బాలకృష్ణ ప్రజా సమస్యలు గాలికొదిలి దిగజారుడు ప్రవర్తన చేశాడన్నారు. మీసాలు తిప్పుతూ తొడలు చరుస్తూ ఆయన చేసిన దిగజారుడు చర్యలకు అసెంబ్లీ వేదిక అవడం సిగ్గుచేటని, ఏదైనా ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించుకోవాలి కానీ కవ్వింపు, దూకుడు చర్యలతో అసెంబ్లీలో టీడీపీ నాయకులు వ్యవహరించిన తీరు బాధాకరం అన్నారు. స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కేసులో చంద్రబాబు నాయుడు చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి అసెంబ్లీలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు రచ్చ చేస్తున్నారే తప్ప ప్రజా సమస్యలపై వారికి చిత్తశుద్ధి ఎక్కడుందన్నారు. రెండుసార్లు హిందూపురం ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ తన సొంత నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు. అసెంబ్లీకి రాకుండా సినిమా షూటింగ్‌లతో కాలం గడిపిన బాలకృష్ణ బావ చంద్రబాబు అరెస్టు కావడంతో అసెంబ్లీకి వచ్చి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. అసలు అసెంబ్లీ విధివిధానాలు, చర్చపై ఆయనకు ఏ మాత్రం అవగాహన అయినా ఉందేమో ఆత్మ పరిశీలన చేసుకొని ప్రవర్తిస్తే మంచిది కానీ దేవాలయం లాంటి అసెంబ్లీలో సినిమా షూటింగ్‌ తరహాలో హావభావాలు ప్రదర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేసేలా వ్యవహరించిన బాలకృష్ణపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

జీజీహెచ్‌ అభివృద్ధికి సహకరించాలి

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌ అభివృద్ధికి ప్రజలు అండగా నిలువాలని సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఏకుల కిరణ్‌కుమార్‌ కోరారు. రైల్వే స్టేషన్‌ సమీపంలో ఎమర్జెన్సీ అంబులెన్సు సర్వీసెస్‌ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా గురువారం అన్నదానం నిర్వహించారు. సూపరింటెండెంట్‌ డాక్టర్‌ కిరణ్‌కుమార్‌ ముఖ్య అతిథిగా హాజరై భోజనం వడ్డించారు. ఆయన మాట్లాడుతూ అంబులెన్సు నిర్వాహకుల సేవలు విలువైనవని కొనియాడారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, అసాంఘీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. డెప్యూటీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ డి.ఎస్‌.ఎస్‌.శ్రీనివాస ప్రసాద్‌, అంబులెన్సు సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

అసిస్టెంట్‌ కమిషనర్‌ లక్ష్మీపతిరావు



జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వేను పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్‌ కమిషనర్‌ లక్ష్మీపతిరావు

మంగళగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నగర పాలక సంస్థ అసిస్టెంట్‌ కమిషనర్‌ లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. గురువారం నగరంలోని కొత్తపేటలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ప్రత్యేక క్యాంపుల్లో ప్రత్యేక వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గణపతినగర్‌ వైఎస్సార్‌ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ అనూష, సూపర్‌వైజర్‌ జయలక్ష్మి, ఏఎన్‌ఎం ఎ జ్యోతి, ఆశా వర్కర్‌ రెహానా తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భద్రత జగనన్న ఆరోగ్య సురక్ష



ఫిరంగిపురంలో పరీక్షలు చేస్తున్న ఆరోగ్యసిబ్బంది

ఫిరంగిపురం: పేదల ఆరోగ్యానికి భద్రత జగనన్న ఆరోగ్యసురక్షతో లభిస్తుందని ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టార్‌ వైద్యురాలు పి.ఎస్తేరురాణి అన్నారు. మండల కేంద్రంలోని శాంతిపేట, విజ్ఞానపురం, సొలస బస్టాండు సెంటర్‌, కొత్తపేట, రసూల్‌పేట ప్రాంతాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షపై ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించినట్లు డాక్టర్‌ ఎస్తేరురాణి తెలిపారు. ఇంటిలోని వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వాటిని యాప్‌లో అప్‌లోడు చేస్తున్నామన్నారు. ఏ రోజు వైద్యశిబిరం నిర్వహిస్తామో ఆ తేదీ సమయం కేటాయిస్తూ వారికి ముందుగానే టోకెన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా గుర్తించిన వ్యాధులకు ఆప్రాంత పరిసరాల్లో నిర్వహించే శిబిరాల్లో చికిత్స చేస్తారని అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు కూడా చేయించనున్నట్లు ఆమె వివరించారు. ఆమె వెంట సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఏఎన్‌ఎంలు భారతీజ్యోతి, మాబు, లావణ్య, ఆనందకుమారి, అరుణ, ఆంతోనిరాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: ఖరీఫ్‌ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు డిమాండ్‌ చేశారు. గురువారం వడ్డేశ్వరం, కొలనుకొండ, చిర్రావూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులతో కలసి వ్యవసాయ అధికారులకు వినపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న నష్టపరిహారం అందలేదని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా సాగు రైతులకు రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు, వ్యవసాయ పరికరాలు ప్రభుత్వ సబ్సిడీతో రైతులకు అందడం లేదని అన్నారు. రెండు లక్షల రూపాయల వరకు రైతు, కౌలు రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్‌ చేస్తున్నామన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలను అందించాలని, అపార్ట్‌మెంట్‌ నిర్మాణాలతో వస్తున్న మురుగునీటిని పంట కాలువలలో కలపకుండా డ్రెయిన్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. స్థానిక సమస్యలపై ఈనెల 25వ తేదీన అన్ని మండల కేంద్రాలలో జరిగే ధర్నాలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, బత్తుల సంసోను, రైతు నాయకులు కాట్రగడ్డ శివన్నారాయణ, వీరాస్వామి, షేక్‌ పాపా సాహెబ్‌, కౌలు రైతులు పల్లపాటి సుబ్బారావు, పోకల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలలో పిల్లలను ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- స్విమ్మింగ్‌ ఫూల్‌, స్కేటింగ్‌ ట్రాక్‌ పనులను పరిశీలన



స్విమ్మింగ్‌ ఫూల్‌ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: పిల్లలను విద్యతోపాటు క్రీడలలోను ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)అన్నారు. నగరంలోని ఆత్మకూరు గుంటూరు ఛానల్‌ వద్ద డాక్టర్‌ వైఎస్సార్‌ మెమోరియల్‌ క్రీడా ప్రాంగణంలో నిర్మాణం పూర్తి చేసుకుని తుది మెరుగులు దిద్దుకుంటున్న స్విమ్మింగ్‌ ఫూల్‌, స్కేటింగ్‌ ట్రాక్‌ పనులను ఎమ్మెల్యే గురువారం రాత్రి పరిశీలించారు. స్విమ్మింగ్‌ ఫూల్‌, స్కేటింగ్‌ ట్రాక్‌లలో మిగిలిన అన్ని పనులు పూర్తి చేసి ఈ నెల 25వ తేదిన ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచి విద్య ఎంత ముఖ్యమో క్రీడలు అంతే ముఖ్యమని అవగాహన కల్పించి వారికి క్రీడలలో ప్రోత్సహించాలన్నారు. నగరాన్ని క్రీడా హబ్‌గా మార్చాలనే లక్ష్యంతోపాటు నగర వాసులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే స్విమ్మింగ్‌, స్కేటింగ్‌లతో మరికొన్ని క్రీడలకు అవకాశం కల్పించేలా డాక్టర్‌ వైఎస్సార్‌ మెమోరియల్‌ క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. నగర కమిషనర్‌ యు శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్‌, ఆకురాతి రాజేష్‌, దాసరి వీరయ్య పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు టిఫిన్‌ బండ్లు అందజేత



వెంకాయమ్మకు టిఫిన్‌ బండిని అందజేస్తున్న వైఎస్సార్‌ సీపీ వడ్డేశ్వరం కన్వీనర్‌ గొడవర్తి శ్రీనివాసరావు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన కోట వెంకాయమ్మ వ్యాపారాభివృద్ధికి సహాయపడే విధంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తన సొంత ఖర్చులతో టిఫిన్‌ బండిని తయారు చేయించి వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్‌ గొడవర్తి శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌కె మీరాషా, చంద్రరావు, లక్ష్మణ, కృపారావు తదితరులు పాల్గొన్నారు.

–గుండిమెడలో చిరు వ్యాపారం నిర్వహించుకునే గుండిమెడ అరుణకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో వైఎస్సార్‌ సీపీ రూరల్‌ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి గురువారం టిఫిన్‌ బండిని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిడికిలి కృష్ణప్రసాద్‌, నామతోటి కోటేశ్వరరావు, జెట్టి కోటేశ్వరరావు, నామతోటి వెంకటరావు, గుండిమెడ అమృతరావు, కట్టెపోగు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే దళితుల రాజ్యాధికార సాధన

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌ కుమార్‌

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ చెల్లదని పార్లమెంటులో కేంద్ర మంత్రులు, అన్ని రాజకీయ పార్టీ ఎంపీలు చెప్పారని, ఇప్పటికైనా మంద కృష్ణ మాదిగ నిజం తెలుసుకొని దళితుల రాజ్యాధికారం కోసం కలసికట్టుగా పని చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌ కుమార్‌ పేర్కొన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన హలో మాల– చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా గురువారం పార్లమెంటులో మంత్రులు, ఎంపీలను కలసి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా గోళ్ల అరుణ్‌ కుమార్‌ మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని తెలిపినా, మంద కృష్ణ మాదిగ రాజకీయ స్వలాభం కోసమే ఉద్యమాన్ని చేస్తున్నారని విమర్శించారు. ఆయన ఇప్పటికైనా నిజం తెలుసుకొని దళితుల రాజ్యాధికారం సాధించేందుకు కలసికట్టుగా పని చేయాలని కోరారు. ఇప్పటివరకు అగ్రవర్ణ ఆధిపత్యం కింద ఉన్న ఆయన ఆస్తులు పెరిగాయే తప్పా దళితులకు న్యాయం చేసిందేమి లేదని విమర్శించారు. నూతన పార్లమెంటులో మహిళా రిజర్వేషన్‌ బిల్లు పెట్టినందుకు మాల మహానాడు మహిళా నాయకులు, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి, పిల్లి మేరి హర్షం వ్యక్తం చేశారు. నూతన పార్లమెంటులో మొట్టమొదటిగా మహిళా బిల్లు ప్రవేశ పెట్టడం శుభ పరిణామమని తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి రాందాస్‌ అత్వాలేని కలసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గోదా జాన్‌ పాల్‌, కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం, సిరిసిల్ల అధ్యక్షుడు దోషం చంద్రం, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేందర్‌, దయాకర్‌, మాల మహానాడు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

వా ప్రకటన M/s. Shriram Finance Ltd., Palamala Branch, VIA వారి తరఫున ... [illegible]

... 18-02-1992 ... నెం. 402/1992 ... 19-12-2019 ... 1618/2019 ... 29-05-2020 ... 2025/2020 ... 7 రోజులలో Regd. Post with Ack Due ద్వారా ... [illegible]

షెడ్యూలు: గుంటూరు జి., మంగళగిరి సబ్‌.డి. ... 224/1 ... 5-460 ... 250.0 ... 20 ... [illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., VIJAYAWADA.
Ph:9849431432

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com